

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
మంగళవారం 11 నవంబరు 2025





మెతుకు సీమలోనే
మొదటిసారి..

- 'మాయమైపోతున్నడమ్మా'.. మెదక్‌లో..
- 'జయహే తెలంగాణ'.. సిద్దిపేటలో..

మెదక్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వాగ్గేయకారుడు అందెశ్రీకి బాగా పేరు తీసుకువచ్చిన మాయమైపోతున్నడమ్మా.. అనే పాట, రాష్ట్ర గీతంగా గుర్తింపు పొందిన జయ జయహే తెలంగాణ గీతం మొదటిసారి ఆలపించింది ఉమ్మడి మెదక్ జిల్లాలోనే. ఏపీటీఎఫ్ మెదక్ యూనిట్‌కు అనుబంధంగా సాంస్కృతిక సమాలోచన వేదిక అనే సంస్థ ఆధ్వర్యంలో 2002 మేలో మెదక్‌లో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాభూమి చిత్ర దర్శక నిర్మాన నర్సింగరావు, అందెశ్రీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో అందెశ్రీ "మాయమైపోతున్నాడమ్మా.." పాటను మొదటిసారి పాడారు. రాష్ట్ర గీతంలో గుర్తింపు పొందిన 'జయ జయహే తెలంగాణ' గీతం మొదటిసారి సిద్దిపేటలో వినిపించారు అందెశ్రీ. 2003 మార్చి 2న నాటి తెలంగాణ రచయితల వేదిక వార్షికోత్సవంలో తొలిసారి ఆయన ఈ గీతాన్ని ఆలపించారు.

మరలిరాని లోకాలకు
మట్టి మనిషి

- అందెశ్రీ స్వగ్రామం రేబర్తి
- గ్రామం వదలి 40 ఏళ్లు
- జిల్లాలో విషాదం

మద్దూరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వాగ్గేయకారుడు, కవి అందె ఎల్లయ్య అలియాస్ అందెశ్రీ ఇక లేరన్న విషయం తెలిసి ఆయన స్వగ్రామమైన మండలంలోని రేబర్తితో పాటు ఉమ్మడి జిల్లాలో విషాదం నెలకొంది. ఆయన చిన్ననాటి దోస్తులు, గ్రామస్థులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. మట్టిమనిషిగా ఎదిగిన అందెశ్రీకి ఉమ్మడి జిల్లాలోని సాహితీమిత్రులు, ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు, పాత్రికేయులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

రేబర్తికి చెందిన అందె బొడ్డయ్య, ఎల్లవ్వ పెద్దకుమారుడైన అందె ఎల్లయ్య(అందెశ్రీ) చిన్నతనంలో కటిక పేదరికం అనుభవించారు. తినడానికి తిండి కూడా సరిగ్గా దొరకని పరిస్థితుల్లో జీతం ఉండి.. సద్ద పిసికిళ్ల (సద్దలు), సిలుపక్కపండ్ల(సీతాఫలాలు) రేగుపండ్లు, ఇరికిపండ్లు, పరికిపండ్లు తిన్న రోజులూ యాది చేసుకుంటున్నారు. గేదె మీద కూర్చొని మోట కొట్టుకుంటూ రాగం తీస్తే ఆయన స్నేహితుడు శివయ్యతో పాటు మరికొందరు 'తిన్నదరక్క రాగం దీస్తుండు' అనుకునేవాళ్లు. గ్రామాల్లో బాలనాగమ్మ, చిరుతల ఆటలు, బాగోతాలు, బుర్ర కథలు అందెశ్రీకి ప్రేరణనిచ్చాయి. బర్లు కాసే సమయంలో ఆదమరిస్తే దెబ్బలు పడ్డరోజులు యాదికొస్తే, ఇసుకలో నిద్రపోయి యాదమర్చిన సంఘటనలు స్నేహితులు గుర్తు చేశారు. అక్షర జ్ఞానం లేకపోవడంతో కర్రపుల్లతో భూమిమీద అక్షరాలు రాసే ప్రయత్నం చేస్తూ గ్రామంలోని మేర్గు జగన్నాథం సార్ వద్ద పాటలు రాయించుకున్నారు.

ఊరు దాటించిన మేస్త్రీ పని

నిజామాబాద్, చేర్యాలలలో కూలీ పనులకు వెళ్లి మేస్త్రీగా పని నేర్చుకుని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేవారు. 40 ఏళ్ల క్రితం పని కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. మేస్త్రీ పని చేస్తున్న సమయంలోనే ఓ జోగినితో పరిచయం కాస్త జోగినీల జీవితాల ఆధారంగా గంగ సినిమాకు శ్రీకారం చుట్టింది.

రాష్ట్ర గీతం దాక..

అందెశ్రీ తెలంగాణ ఉద్యమంలో పాటల ప్రవాహంగా ఎదిగి తెలంగాణ రాష్ట్ర గీతం స్థాయికి ఎదిగి ప్రత్యేక రాష్ట్ర సాధనకు పురికొల్పడానికి

మిగతా 7వ పేజీలో

సిద్దిపేట మెడికల్ కాలేజీకి
మరో 8 పీజీ సీట్లు

- రేడియాలజీ, ఆర్థోపెడిక్ విభాగాల్లో మంజూరు
- అనతి కాలంలోనే 18 స్పెషాలిటీలలో కోర్సులు
- ఉస్మానియా, గాంధీ, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీల స్థాయిలో సిద్దిపేట వైద్య కళాశాల

సిద్దిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు మరో 8 పీజీ (పోస్ట్‌గ్రాడ్యుయేట్) సీట్లు మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఉత్తర్వులు జారీ చేసింది. మొదట్లో 13 సీట్లతో పీజీ విద్య ప్రారంభం కాగా, ఆ తరువాత పలు స్పెషాలిటీ విభాగాల్లో సీట్ల సంఖ్య పెరుగుతూ రావడం వల్ల, ప్రస్తుతం పీజీ సీట్ల సంఖ్య 83కు చేరింది. నూతనంగా రేడియాలజీలో 4 సీట్లు, ఆర్థోపెడిక్‌లో 4 సీట్లు ఎన్ఎంసీ మంజూరు చేసింది. మెడికల్ కళాశాలలో పీజీ కోర్సులకు సంబంధించి పలు స్పెషాలిటీల్లో సీట్ల సంఖ్య పెరగడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఉస్మానియా, గాంధీ, వరంగల్‌లోని కాకతీయ వైద్యకళాశాల తరువాత సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలలోనే అత్యధిక పీజీ కోర్సులున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం నుంచి ఈ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పరీక్ష ఫీజు చెక్కును కలెక్టర్‌కు అందజేస్తున్న బీజేపీ నాయకులు

పదోతరగతి విద్యార్థుల
పరీక్ష ఫీజు చెల్లించిన కేంద్ర మంత్రి

- రూ. 1,41,025 చెక్కును కలెక్టర్‌కు అందించిన బీజేపీ నాయకులు

హుస్నాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట జిల్లాలో పదోతరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ "మోదీ గిఫ్ట్" పేరిట పరీక్ష ఫీజును చెల్లించారు. సంబంధిత ఫీజు చెక్కును సోమవారం బీజేపీ నాయకులు కలెక్టర్ హైమావతికి అందించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి మండలాల్లో 1118 మంది 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు తన వేతనం నుంచి పరీక్ష ఫీజు నిమిత్తం రూ. 1,41,025 చెక్కును అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారేనని, వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పరీక్ష ఫీజుల విషయంలో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కేంద్రమంత్రి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులకు ఫీజు మొత్తాన్ని చెల్లిస్తున్నారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గంగిడి మోహన్‌రెడ్డి, హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, సంపత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ హైమావతి

ప్రజావాణికి 200 దరఖాస్తులు

- కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి మొత్తంగా 200 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ హైమావతి పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ వినతులను స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కన్నీరు మిగిల్చి..!



- క్షణికావేశంలో ఆత్మహత్యలు..
- జిల్లాలో పెరుగుతున్న ఘటనలు
- అధికారికంగా నెలకు 30 వరకు..
- రికార్డుల్లో నమోదు కానివి అంత కన్నా ఎక్కువే..
- కుటుంబ కలహాలు.. అప్పులు.. ప్రేమ వ్యవహారాలు

జిల్లాలో నిత్యం ఏదో ఓ చోట క్షణికావేశంలో నిండు జీవితాలు బలవుతున్నాయి. రియల్ ఎస్టేట్ పతనం, ఉపాధి లేమి, కుటుంబ కలహాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లో మోసపోవడం, ప్రేమ ఇలా ఏదో ఒక కారణంతో జిల్లాలో రోజుకు సగటున ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. అధికారులు అవగాహన కల్పిస్తున్నా.. ప్రచారాలు చేస్తున్నా.. ఆత్మహత్యలు మాత్రం తగ్గడం లేదు.

- గజ్వేల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా ఆత్మహత్యలు నిత్యకృత్యంగా మారాయి. రోజుకు ఏదో ఒక మండలంలో ఆత్మహత్యల వార్తలు వినబడుతూనే ఉన్నాయి. క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాల వల్ల వారి కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి.

నెలకు 30కి పైగా బలవన్మరణాలు!

సిద్దిపేట జిల్లాలో ప్రతి నెలా సరాసరిగా 30 మంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే, వాస్తవానికి ఈ సంఖ్య 60 నుంచి 70 వరకు ఉంటుందని తెలుస్తోంది. పలువురు కుటుంబ సభ్యులు అధికారులకు సమాచారం ఇవ్వడానికి ఇష్టపడక, కేసులు నమోదు చేయకుండానే అంత్యక్రియలు చేస్తున్నట్లు సమాచారం. గడిచిన ఆరు నెలల్లో అధికారిక లెక్కల పకారం 150 మంది ఆత్మహత్య చేసుకుంటే, వాస్తవ సంఖ్య 300 వరకు ఉంటుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో 40 ఏళ్ల లోపు వారే అధికంగా ఉండటం ఆందోళనకరం.

జిల్లాలో రెండేళ్లుగా రియల్ వ్యాపారం కుదేలవడం, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉపాధి మార్గాలు లేకపోవడం ఆత్మహత్యల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. రియల్ వ్యాపారం తగ్గడంతో, భూములు కొనుగోలుకు ఎవరూ ముందుకు రాకపోవడం, చేసిన అప్పులు తీర్చే మార్గం లేకపోవడం కారణంగా పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. భూముల ధరలు భారీగా పెరగడంతో ఆస్తి తగాదాలు, సరిహద్దుల, సర్వే నంబర్ల సమస్యలు ఎక్కువై ప్రజల మధ్య

మిగతా 8వ పేజీలో



ఆశ.. అనారోగ్యం.. అప్పులు

- బీఎండబ్ల్యూ ఆశ: జూన్ 1న జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లిలో ఫాంహౌస్ కూలీ కుమారుడు బీఎండబ్ల్యూ కారు కావాలని పట్టుబట్టాడు. తల్లిదండ్రులు తమ స్థోమతకు మించి స్విఫ్ట్ కారు కొనిస్తామని చెప్పినా వినకుండా ఆత్మహత్యకు పాల్పడి తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిల్చాడు.
- అనారోగ్యంతో తల్లీకూతురు : జూలై 11న వర్గల్ మండలం గౌరారంలో అనారోగ్యంతో తల్లికూతుళ్లు ఆత్మహత్యకు పాల్పడగా, కూతురి ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు.
- మల్టీలెవల్ మార్కెటింగ్ ఉచ్చు: మల్టీలెవల్ మార్కెటింగ్ ఉచ్చులో పడి అప్పుల పాలైన వర్గల్ మండలం వేలూరు గ్రామానికి చెందిన హరికృష్ణ అక్టోబరు 9న ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో పోలీసులు పలువురిని అరెస్టు చేశారు.
- చిన్న చిన్న కారణాలు: నవంబరు 4న తల్లిదండ్రులకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మనస్తాపంతో గజ్వేల్ భారత్‌నగర్‌కు చెందిన యువతి ఆత్మహత్య చేసుకుంది. నవంబరు 5న కొండపాక మండల కేంద్రంలో నాయనమ్మ తిట్టిందని కరుణాకర్ అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు లేక ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోవడంతో దారుణానికి ఒడిగట్టాడు.
- మద్యానికి బానిసై : మద్యానికి బానిసలుగా మారి గజ్వేల్, జగదేవ్‌పూర్, వర్గల్, ములుగు, కొండపాకతో పాటు పలు మండలాల్లోని అనేక గ్రామాల్లో పలువురు ఆత్మహత్యలకు పాల్పడి వారి కుటుంబాలను దుఃఖంలో ముంచుతున్నారు.

కార్తీక దీపోత్సవం



కార్తీక దీపాలతో మహిళలు

సిద్దిపేట కోమటిచెరువు కట్టపై సోమవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అరటిబోదల్లో నెయ్యి దీపాలు వెలిగించి గంగమ్మకు సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు నిర్వాహకులే దీపాలు, పంచామృతాలు, పూలు, పండ్లు, పూజా సామగ్రిని అందజేశారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, దిశా సభ్యురాలు వనజ, వైద్యురాలు డా. గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

- సిద్దిపేట కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి)



గంగమ్మకు దీపాలు సమర్పిస్తున్న మహిళలు

గొడుగుపల్లి అడవిలో చిరుత కలకలం

- పరుగెత్తలేని స్థితిలో..
- రెస్క్యూ కోసం హైదరాబాద్ నుంచి నేడు ప్రత్యేక బృందం రాక

దౌల్తాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం చిరుతపులి సంచారం స్థానికంగా భయాందోళనలు సృష్టించింది.

గొడుగుపల్లికి చెందిన చంద బిక్షపతి రోజూలాగే తన పొలం వద్ద పశువులను మేపుతుండగా చిరుతపులి పశువులపై దాడి చేసేందుకు ప్రయత్నించింది. అప్రమత్తమైన బిక్షపతి కేకలు వేయడంతో చిరుత వెనక్కి తగ్గింది. తన వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో, వెంటనే పక్కనే ఉన్న జేత్రం తండా రైతులు కడతార్ రాములు, చందర్, శ్రీకాంత్ వద్దకు వెళ్లి విషయం చెప్పాడు. వారంతా వచ్చి చూడగా, పొదల్లో చిరుత నక్కి ఉండడాన్ని గుర్తించారు. ఈ సమాచారాన్ని వెంటనే అటవీ అధికారులకు చేరవేశారు. దుబ్బాక రేంజ్ అధికారి సందీప్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ హైమద్, బీట్ ఆఫీసర్ వేణు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని చిరుతను పరిశీలించారు. పొదల్లో దాగి ఉన్న ఈ చిరుత (సుమారు 4 నుంచి 5 ఏళ్ల వయసు ఉంటుందని అంచనా) కదలాడుతూ, కాళ్లపై నిలబడి ఉన్నప్పటికీ, పరిగెత్తలేని స్థితిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. బహుశా ఎక్కడో వేట చేసి ఉండడం వల్ల ఆ స్థితికి చేరుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం దానికి ఆహారం, నీరు రెండు రోజుల వరకు అవసరం లేదని రేంజ్ అధికారి పేర్కొన్నారు.



పొదల్లో దాక్కున్న చిరుతపులి

నేడు రెస్క్యూ ఆపరేషన్

పొదల్లో దాగి ఉన్న చిరుత సమాచారాన్ని ఉన్నతాధికారులకు, హైదరాబాద్ స్పెషల్ రెస్క్యూ టీమ్‌కు చేరవేశారు. స్పెషల్ టీమ్ మంగళవారం వస్తుందని, వారు ఇచ్చిన వివరాలు, సూచనల మేరకు తదుపరి రెస్క్యూ చర్యలు తీసుకుంటామని రేంజ్ అధికారి సందీప్ కుమార్ వెల్లడించారు. అలాగే, వెటర్నరీ వైద్యులకు కూడా సమాచారం అందించామని, చిరుత ఆరోగ్యాన్ని పరిశీలించిన తర్వాత తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. చిరుత పూర్తిగా కోలుకునే వరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

రైతులకు హెచ్చరిక

చిరుత ఆ ప్రాంతంలోనే ఉన్నందున, చుట్టుపక్కల పొలాల రైతులు ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లవద్దని, జాగ్రత్తగా ఉండాలని రేంజ్ అధికారి సందీప్ కుమార్ హెచ్చరించారు.

గజగజ..

వణుకుతున్న ఉమ్మడి జిల్లా

- సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- సిద్దిపేట జిల్లా మర్కుక్‌లో 11.8 డిగ్రీలు
- మెదక్ జిల్లా హవేళీఘనపూర్‌లో 12.3 డిగ్రీలు

మెదక్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చలి విజృంభిస్తున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యల్ప రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మూడు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో రాష్ట్రంలోనే ద్వితీయస్థానంలో నిలుస్తుండడం గమనార్హం. ఉదయం 10 గంటల వరకు చలిగాలులు వీస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోనే అత్యల్పంగా సోమవారం సంగారెడ్డి జిల్లాలోని కోహీర్‌లో 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా మర్కుక్‌లో 11.8 డిగ్రీలు, మెదక్ జిల్లా హవేలీఘనపూర్‌లో 12.3 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. న్యాల్‌కల్‌లో 11.4 డిగ్రీలు, మొగుడంపల్లిలో 11.4 డిగ్రీలు, గుమ్మడిదలలో 11.8 డిగ్రీలు, కొండపాకలో 12.1 డిగ్రీలు, హవేళీఘనపూర్‌లో 12.3 డిగ్రీలు, నర్సాపూర్‌లో 12.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వచ్చే వారం రోజులు ఉష్ణోగ్రతలు మరింత తగ్గిపోయే అవకాశం ఉందని సీపీవో కార్యాలయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రాత్రి ఏడు గంటలకే చలిగాలులకు వీధుల్లో జనసంచారం లేక నిర్మానుష్యమవుతున్నాయి. చలి తీవ్రతకు పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అస్తమా వ్యాధిగ్రస్తులు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. పక్షవాతం తదితర రోగులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మున్సిపల్, పంచాయితీ పారిశుధ్య కార్మికులు తెల్లవారుజామున వీధులు శుభ్రం చేస్తున్న సమయంలో చలికి తట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు.



కల్లు దుకాణంలో వలస కార్మికుడి మృతి

● ముప్పిరెడ్డిపల్లిలో చోటుచేసుకున్న ఘటన


కల్లు దుకాణంలో కాళీ చరణ్ మృతదేహం

మనోహరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలోని కల్లు దుకాణంలో ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మేస్త్రీ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలసొచ్చిన కాళీ చరణ్ (35)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పది రోజుల క్రితం ఒక పరిశ్రమలో మేస్త్రీ పని నిమిత్తం ముప్పిరెడ్డిపల్లికి వచ్చాడు. ఆదివారం రాత్రి గ్రామంలోని చెంది మహేష్ కల్లు దుకాణానికి వెళ్లాడు. సోమవారం ఉదయం దుకాణ యజమాని కల్లు దుకాణంలో కాళీ చరణ్ పడిఉండడాన్ని గుర్తించాడు. విషయం తెలిసి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాళీచరణ్ పాలివాడు అంకిత్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుకోని దర్యాప్తు చేస్తున్నారు. అయితే, కాళీచరణ్ కల్లు దుకాణంలో చనిపోతే గుండెపోటుతో మృతిచెందాడని స్నేహితుడు చెప్పడంపై గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

సంగారెడ్డి క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : లారీ డ్రైవర్ అజాగ్రత్త, అతి వేగం కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ పట్టణానికి చెందిన ఎర్రోళ్ల శామ్యూల్ అతని భార్య ఎర్రోళ్ల సునీత(40) కలిసి బైక్‌పై శంకర్‌పల్లి మండలం ఫతేపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి తమ స్వగ్రామమైన మెదక్ పట్టణానికి సోమవారం బైక్‌పై వెళ్తుండగా సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో లారీ ఢీకొన్నది. దీంతో బైక్‌పై ఉన్న సునీత లారీ చక్రాల కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త శామ్యూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..


పాల్యా రాందాస్ (ఫైల్)

రేగోడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన రేగోడు మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. బురన్‌వాడి తండాకు చెందిన పాల్యా రాందాస్(44) ఆదివారం రాత్రి తన వ్యవసాయ భూమిలో ఉన్న పశువుల షెడ్‌లో లైట్ వేయడానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో తండ్రి అంబర్యానాయక్ వెళ్లి చూడగా విద్యుత్ వైర్ తగిలి మృతి చెందినట్లు గుర్తించారు. రాందాస్ నాయక్‌కు భార్య, ఒక బాబు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య సునీతభాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పోచయ్య సోమవారం తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

పటాన్‌చెరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి ఔటర్ సర్వీస్ రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

రామాయంపేటలో...

రామాయంపేట, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సోమవారం సాయంత్రం అపస్మారకస్థితిలో పడి ఉన్న అతడిని పలువురు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై బాలరాజ్ అక్కడికి చేరుకొని చూడగా అతను అప్పటికే చనిపోయాడు. సుమారు 55 ఏళ్ల వయస్సున్న ఆయన ఎడమ చేతిపై ఎన్టీఆర్ అని పచ్చబొట్టుతో రాసి ఉందని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిజాంపేటలో దొంగల బీభత్సం

● బంగారం, వెండి నగలు అపహరణ

నారాయణఖేడ్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేటకు చెందిన మర్రి దత్తు, భార్య కావేరి తమ ఇంటికి తాళం వేసి సమీపంలోని మునిగేపల్లిలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి ఆదివారం రాత్రి వెళ్లారు. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లో ప్రవేశించి బీరువాలో దాచి ఉంచిన నాలుగు తులాల బంగారు నగలు, 30 తులాల వెండిని అపహరించుకుపోయారు. ఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, వారి గృహాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి, క్లూస్‌టీంను రప్పించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగలను గుర్తించేందుకు యత్నిస్తున్నామని ఎస్ఐ శ్రీశైలం తెలిపారు.

విద్యుత్ తీగల అపహరణ

పట్టించుకోని అధికారులు

మనూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మనూరు మండల పరిధిలోని పుల్‌కూర్తి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన విద్యుత్ తీగలు చోరీకి గురైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎత్తిపోతల పథకం నిర్మించినప్పటికీ ఆ పథకం పని చేయడం లేదు. దీంతో విద్యుత్ లైన్ నిరుపయోగంగా ఉంటుంది. ఇది గమనించిన కొందరు 27 స్తంబాల నుంచి వెళుతున్న విద్యుత్ తీగను (అల్యూమినీయం వైర్) దొంగిలించుకు వెళ్లారు. ఎత్తిపోతల పథకానికి సంబంధించిన అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఈ విషయాన్ని తెలిపినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదని పుల్‌కూర్తి గ్రామస్థులు పేర్కొన్నారు. విద్యుత్ వైర్ చోరీపై పలు అనుమానాలు వ్యక్తమతున్నాయని వారు తెలిపారు.

అత్యాచారం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

రామచంద్రాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ. 2వేల జరిమానా విధిస్తూ సంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు మెజిస్ట్రేట్ కె.జయంతి సోమవారం తీర్పు వెల్లడించారు. గతేడాది తెల్లాపూర్ ఆకృతి లేబర్ క్యాంప్‌లో నివాసముంటున్న రాజేందర్ భూయాన్(45) అదే క్యాంప్‌లో ఉంటున్న బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పట్లో సీఐ రవీందర్ కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసును వాదించిన బి.సూరారెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్, దర్యాప్తు అధికారులు ఎస్ఐ ఎస్.సురేష్, సీఐలు గణేష్ పటేల్, కే.రవీందర్, కానిస్టేబుళ్లు దర్యాప్తులో పాల్గొన్నారు.


పక్కన పెట్టిన ఖేడ్ ఏరియా ఆస్పత్రి అంబులెన్స్ వాహనం

ఆపదలో అంబులెన్స్‌లు

- కిలోమీటర్ల పరిమితి దాటిన వాహనాలు
- మొరాయిస్తున్న ఖేడ్, మనూరు 108 అంబులెన్స్‌లు
- ఖేడ్ ఏరియా ఆస్పత్రిలోని అంబులెన్స్ నిలిపివేత
- ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పనిస్థితి
- సేవలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

నారాయణఖేడ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర వైద్య సేవలకు వెన్నెముకగా నిలిచే 108 వాహనాలకు తోడు స్థానిక ఏరియా ఆసుపత్రి అంబులెన్స్‌లు కాలం చెల్లిపోవడంతో ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయి. గతంలో గర్భిణులు, రోడ్డు ప్రమాద బాధితులకు ఈ అంబులెన్స్‌లు సంజీవనిలా ఉపయోగపడ్డాయి. ఈ సేవలు ప్రస్తుతం ప్రభుత్వ నిర్లక్ష్యంతో దారుణమైన స్థితికి చేరుకున్నాయి.


ఖేడ్‌లోని కాలంచెల్లిన 108 అంబులెన్స్ వాహనం

3 లక్షల కి.మీ.లకు మించి..

నారాయణఖేడ్, మనూరులోని 108 వాహనాలు కాలం చెల్లిపోయాయి. ప్రమాదంలో ఉన్న వారిని హుటాహుటిన వైద్యశాలలకు చేర్పించే వాహనాలను 3 లక్షల కిలోమీటర్ల వరకే తిప్పాల్సి ఉంటుంది. ఈ రెండు 108 వాహనాలు మూడున్నర నుంచి నాలుగు లక్షల కిలోమీటర్ల వరకు ప్రయాణం చేశాయి. దీంతో అవి రోగులను తీసుకెళ్తున్న క్రమంలో అనేక మార్లు మొరాయించాయి. ప్రస్తుతం ఫోన్ చేసిన గంటల అనంతరం కూడా 108 వాహనాలు రోగుల వద్దకు చేరుకునే పరిస్థితి లేదు. స్థానిక ఏరియా ఆసుపత్రికి కేటాయించిన అంబులెన్స్ ఏకంగా 4.5 లక్షల కిలోమీటర్లు తిరగడంతో, సురక్షితం కాదని వారం రోజులుగా వాహనాన్ని నిలిపివేశారు. ఇటీవల ఖేడ్‌కు డిప్యూటేషన్‌పై నియామకమైన డ్రైవర్లు కూడా అంబులెన్స్ వాహనాన్ని నిలిపి సంగారెడ్డికి వెళ్లినట్లు తెలిసింది. నారాయణఖేడ్‌కు గత ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి ద్వారా మంజూరైన ఓమిని అంబులెన్స్ రిజిస్ట్రేషన్ చేయించకపోవడంతో దానిని కూడా జిల్లా వైద్యశాలల కోఆర్డినేటర్ సూచన మేరకు సంగారెడ్డిలోనే నిలిపిఉంచారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో (సంగారెడ్డి, హైదరాబాద్‌కు తరలించాల్సిన) రోగులు తప్పనిసరిగా ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఖేడ్ డివిజన్‌లో ఇదీ పరిస్థితి..

నారాయణఖేడ్, మనూరు మండలాలకు కాలం చెల్లిన వాహనాలు ఉండగా, నాగల్‌గిద్ద, నిజాంపేట వంటి మారుమూల మండలాలకు 108 వాహనాల జాడే లేదు. కల్హేర్, సిర్గాపూర్, కంగ్టి మండలాల్లో మాత్రమే నూతన వాహనాలు అందుబాటులో ఉన్నాయి.

వెంటనే కొత్త వాహనాలు ఇవ్వాలి

వెంటనే కాలంచెల్లిన అంబులెన్స్‌ల స్థానంలో కొత్త వాహనాలను ఇవ్వాలని, మారుమూల ప్రాంతాలైన నాగల్‌గిద్ద, నిజాంపేట మండలాలకు కూడా కొత్త 108 వాహనాలను మంజూరు చేయాలని ఖేడ్ ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఖేడ్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.జి.రమేష్‌ను సంప్రదించగా, డ్రైవర్లు లిఖితపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంబులెన్స్‌ను నిలిపివేసినట్టు అంగీకరించారు. ఈ విషయాన్ని జిల్లా సమన్వయకర్తతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.



టీకొట్టులోకి దూసుకెళ్లిన కారు

చేగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : టీకొట్టులోకి కారు దూసుకెళ్లిన సంఘటన మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూరు గ్రామం పరిధిలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకున్నది. నార్సింగి ఎస్సై సృజన తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు వల్లూర్ శివారులో బీభత్సం సృష్టించింది. ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి కారు పక్కనే ఉన్న టీ కొట్టులోకి దూసుకెళ్లింది. అక్కడే టీ తాగుతున్న భీంరావ్‌పల్లి గ్రామానికి చెందిన ఇప్పకింది నరసింహులుకు గాయాలయ్యాయి. బైక్, టీ కొట్టు పూర్తిగా ధ్వంసమైంది.

భూములు ఇచ్చిన మాపైనే జులుమా?

● వేతనాలు అడిగితే బెదిరిస్తున్న కాంట్రాక్టర్‌ను తొలగించాలి
● ఐఐటీహెచ్ గేటు ఎదుట బైఠాయించిన సిబ్బంది

కంది, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌కు భూములు ఇచ్చిన తమపైనే జులుం ప్రదర్శిస్తున్నారని, క్యాంపస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మండిపడ్డారు.


ఐఐటీహెచ్ గేట్ వద్ద బైఠాయించిన కాంట్రాక్టు కార్మికులు

వేతనాలు సకాలంలో రావడంలేదని, కాంట్రాక్టర్ వేధింపులకు గురి చేస్తున్నాడని సోమవారం ఐఐటీహెచ్ గేటు ఎదుట బైఠాయించి వారు ధర్నా నిర్వహించారు. క్యాంపస్‌లో పనిచేస్తున్న హౌస్ కీపింగ్, గార్డెనింగ్, సెక్యూరిటీ తదితర విభాగాల్లోని దాదాపు 400 మంది ఏక కాలంలో విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఎప్పుడూ ఒకటి నుంచి ఐదో తారీకు లోపే వేతనాలు తమ అకౌంట్లో పడేవని తెలిపారు. ఇప్పుడున్న కాంట్రాక్టర్ పదో తేదీ వచ్చినా కూడా వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. ఇదేమిటని అడిగిన వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారని వారు పేర్కొన్నారు. వేతనాల విషయంలో, యూనిఫాం విషయంలో తీవ్ర వ్యత్యాసం చూపిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కాంట్రాక్టు ఉద్యోగం తీసేస్తానని బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఉద్యోగులు వాపోయారు. ఐఐటీ హైదరాబాద్ నిర్మాణం కోసం తాము వ్యవసాయ భూముల్ని ఇస్తే తమకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వకుండా కాంట్రాక్టు ఉద్యోగాలతో సరిపెట్టారని అన్నారు. ఇప్పుడు కనీసం కాంట్రాక్ట్ ఉద్యోగాల జీతాలు సకాలంలో ఇవ్వకుండా మాపైనే బెదిరింపులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని వారు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే కాంట్రాక్టర్‌ను మార్పించి తమకు వేతనాలు సకాలంలో అందేలా చూడాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ఈఎస్ఐపీఎఫ్ లు కూడా అందేలాగా చర్యలు తీసుకోవాలని ఐఐటీహెచ్‌లో పనిచేస్తున్న సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

నవరత్న క్రాప్‌సైన్స్‌తో ఉద్యాన వర్సిటీ ఒప్పందం


ఒప్పందం కుదుర్చుకున్న దృశ్యం

ములుగు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కి చెందిన నవరత్న క్రాప్‌సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మూడు సంవత్సరాల పాటు అమల్లో ఉండే ఈ ఒప్పందం ద్వారా విద్యా పరిశోధన విస్తరణ రంగాల బలోపేతమే లక్ష్యం. విద్యార్థులకు క్షేత్ర శిక్షణ, ఫెలోషిప్‌లు అందజేయడంతో పాటు అధ్యాపకుల మార్పిడికి సహకరించనున్నారు. ఇరువైపులా ప్రయోగశాలలు, పరికరాలు, సాంకేతిక నైపుణ్యాలు పంచుకోగా, మేధోసంపత్తి హక్కులు ఉమ్మడిగా ఉంటాయి. కార్యక్రమంలో వీసీ దండ రాజిరెడ్డి, రిజిస్ట్రార్ భగవాన్, నవరత్న సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మొహమ్మద్‌అలీ, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

మరలిరాని లోకాలకు మట్టి మనిషి


మద్దూరు మండలం రేబర్తిలోని అందెశ్రీ పాత ఇల్లు

(5వ పేజీ తరువాయి)

జీవం పోశాయి అందెశ్రీ పాటలు. తెలంగాణ అవతరించిన తర్వాత అందెశ్రీకి ప్రత్యేక గౌరవం దక్కింది. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు పని హృదయాల్లో పల్లవించేలా రాసిన 'జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం' చరిత్రలో చిరస్థాయిగా నిలిపోయేలా చేశాయి. తన పాటకు బాణీలు కూర్చిన రామాచారికి, గానం చేసిన రామకృష్ణకు తన కీర్తిలో కొంత భాగం దక్కుతుందని అప్పట్లో చెప్పారు. అందెశ్రీ కాకతీయ విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. సినీ ప్రపంచానికి ఎంతో మదురమైన పాటలనందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో కీలక భూమికగా పనిచేసిన అందేశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటించి, ఆయకు రూ. కోటి నగదు బహుమతి అందించి ఘనంగా సత్కరించారు.

అందెశ్రీ విన్నపంతో కదిలిన యంత్రాంగం

మద్దూరు మండలం రేబర్తిలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని అందెశ్రీ సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించడంతోనే, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సిద్దిపేట కలెక్టర్ హైమావతి, తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఈడబ్ల్యూఐడీసీ) ఎండీ గణపతిరెడ్డికి ఆదేశాలు జారీ అయ్యాయి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాస్ రెడ్డి తన బృందంతో కలిసి పాఠశాలను సందర్శించారు. కొత్తగా ఏర్పాటు కాబోతున్న 5 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో భాగంగా రేబర్తి పాఠశాలను అప్‌గ్రేడ్ చేసే అంశం తమ పరిధిలో లేనందున దీనిపై ప్రభుత్వానికి లేఖ రాయాలని విన్నవించారు. పూర్వపు వరంగల్ జిల్లాలో కొనసాగిన జనగామలోని మద్దూరు మండలాన్ని ప్రస్తుత జనగామ జిల్లాలో కలుపాలని సీఎంకు విన్నవించనున్నట్లు తెలిపారు.

చేర్యాల అల్లుడు

చేర్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, కవి అందెశ్రీకి చేర్యాలతో విడదీయరాని బంధం ఉంది. గొర్రెల కాపరిగా, మేస్త్రీగా పనిచేసిన ఆయన నిజామాబాద్ ప్రాంతానికి వలసవెళ్లి 1980లో స్వగ్రామానికి తిరిగి వచ్చి, చేర్యాలలో మేస్త్రీ పని చేశారు. ఈ క్రమంలో చేర్యాల శివారు బండపల్లి కాలనీకి చెందిన గడిపె బాలవ్వ-యాదగిరి నాలుగో సంతానమైన మల్లవ్వను మనువాడారు. అందెశ్రీ అత్త, మామలు చాన్నాళ్లక్రితమే మరణించగా, బండపల్లి కాలనీలో బావమరిది బాలనర్సు నివసిస్తున్నారు. పండుగలు, శుభకార్యాలకు అందెశ్రీ అప్పుడప్పుడు వచ్చివెళుతుండేవాడు. ఈక్రమంలో అందెశ్రీ మృతి పట్ల అత్తింటి వారితో పాటు కాలనీవాసులు విషాదంలో మునిగిపోయారు.

అందెశ్రీ ఆశయాన్ని సీఎం నెరవేర్చాలి

రాష్ట్రానికి అజరామర గీతాన్ని అందించిన అందెశ్రీ గ్రామంలో విద్యాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయాలి. నా చిన్ననాటి దోస్తు మృతి చెందాడన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. ఆయన కుటుంబానికి ఆ దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలి.

- బొమ్మగాని శివయ్య, రేబర్తి చిన్ననాటి స్నేహితుడు

గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తే బాగుండు

40 యేండ్ల క్రితం ఊరు వదిలి వెళ్లారు. ఎంతో గొప్ప పేరు ప్రఖ్యాత్యలు సంపాదించుకున్నారు. గ్రామానికి వస్తే మంచి చెడు మాట్లాడేవారు. ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తే బాగుండేది. బంధువులంతా ఇక్కడే ఉన్నారు.

- అందె పర్శయ్య, అందెశ్రీ అన్న కుమారుడు

ట్యాంకుబండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్రానికి చరిత్రలో మర్చిపోలేని గీతాన్ని అందించిన అందెశ్రీ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి. తెలంగాణ సాహిత్యలోకానికి అందెశ్రీ మరణం తీరనిలోటు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర ఏర్పాటుకు ఉగ్రూతలూగించిన ఉద్యమగీతాలు ప్రత్యేక రాష్ట్రసాధనకు తోడ్పాటునందించాయి. ఆయన మరణం తీరని లోటు కుటుంబానికి ఆభగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలి.

- గిరి కొండల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ

జిల్లాకు అందెశ్రీ పేరు పెట్టాలి

సిద్దిపేట జిల్లాకు అందె శ్రీ పేరు పెట్టి ప్రత్యేక గౌరవాన్ని అందించాలి. అందె శ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు. ఆయన మృతి ఈ రాష్ట్ర ప్రజలకు దిగ్భ్రాంత్రికి గురి చేసింది.

- నాగపురి కిరణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు



చేర్యాలలో సంతాపం వ్యక్తంచేస్తు రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు



కొమురవెల్లిలో అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో అందెశ్రీ చిత్ర పటం ఎదుట నివాళులర్పిస్తున్న నాయకులు



మర్కుక్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అందెశ్రీ మరణంతో చిన్నబోయిన సాహితీలోకం



చేర్యాల: నాగపురి జెడ్పీఎస్ఎస్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తున్న అందెశ్రీ(ఫైల్)



చేర్యాలలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



రేబర్తి పాఠశాలలో అందెశ్రీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, అభ్యుదయవాది అందెశ్రీ మృతి పట్ల జిల్లాలోని సాహితీలోకం చిన్నబోయింది. కవిగా, గాయకుడిగా, రైతుబిడ్డగా, ఇతరత్రావర్గాలతో అనుబంధం పెనవేసుకున్న క్రమంలో ఆయన మరణంతో జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందెశ్రీ మరణం పట్ల పలువురు సాహితీప్రియులు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కొద్దిరోజులక్రితం చేర్యాల మండలం నాగపురి జెడ్పీఎస్ఎస్‌ను ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి పలు సూచనలు చేసిన సందర్భాన్ని పలువురు గుర్తు చేసుకున్నారు. అందెశ్రీ జయజయహే తెలంగాణ గీతంతో ఉద్యమ స్ఫూర్తిని కలిగించారని, రాష్ట్రగీతాన్ని అందించిన గొప్ప కవి అందెశ్రీ అని వెన్నెల సాహితి సంఘం అధ్యక్షుడు వంగర నరసింహ రెడ్డి, కొనియాడారు. తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వరు మాట్లాడుతూ.. అందెశ్రీ మరణం పట్ల సంఘం తరుపున సంతాపం తెలియజేశారు. అందెశ్రీ మరణం తెలంగాణ సాహిత్యానికి తీరని లోటు అని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. తిరుపతిరెడ్డి అన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలో పలువురు నాయకులు, కళాకారులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నియోజకవర్గ జేఏసీ, జన జాగృతి కళాసమితి ఆధ్వర్యంలో అందె శ్రీ హఠాన్మరణానికి చింతిస్తూ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అందెశ్రీ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. పాఠశాల అసెంబ్లీ అనంతరం 2 నిమిషాలు మౌనం పాటించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సంక్షిప్తం

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



ధర్మారంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

మిరుదొడ్డి, నవంబరు10(ఆంధ్రజ్యోతి): ఎవరైనా సరే గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని దుబ్బాక సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం రాత్రి మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో మిరుదొడ్డి ఎస్ఐ సమతా ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. మూఢనమ్మకాలను వీడాలని, జ్వరం వస్తే ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అటెండర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

కొండపాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండపాక ఎంఈవో కార్యాలయంలో సుమారు 20 సంవత్సరాల పాటు అటెండర్‌గా పనిచేస్తున్న నాచారం వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వెంకటయ్యది నిరుపేద కుటుంబం కావడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది ముందుకు వచ్చారు. ఉపాధ్యాయులంతా జమ చేసిన రూ.61,500 లను, 25 కిలోల బియ్యాన్ని వెంకటయ్య కుటుంబ సభ్యులకు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులతో కలిసి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మెరుగైన చికిత్స



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దౌల్తాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు మెరుగైన చికిత్స అందుతుందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పంజ స్వామి అన్నారు. మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన గడ్డమీద జీవన్ రాజుకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.49,500 ఆర్థికసాయం మంజూరైంది. సోమవారం పంజస్వామి బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. వెంట గడ్డమీది శేఖర్ గౌడ్,పూసపల్లి యాదగిరి, కుమార్, బాబు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్‌కు గురుకుల పాఠశాల ఎంపిక

మునిపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోనే లింగంపల్లి గురుకుల సొసైటీ పాఠశాల, కళాశాల ఎంపిక కావడం గర్వకారణమని స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కమిషనర్ మోహన్‌రావువూష్ట స్కౌట్స్, గైడ్స్ కమిషనర్ మోహన్ రావు పేర్కొన్నారు. మండలంలోని లింగంపల్లి గురుకుల సొసైటీ పాఠశాలలో నిర్వహిస్తున్న స్కౌట్స్, గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో బేసిక్ కోర్స్ కార్యక్రమాన్ని సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా కార్యక్రమాన్ని లీడర్ ట్రైనింగ్ గైడ్ భరతమాత, హిమాలయ హుడ్ బాడ్జీ సాల్మన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు.

తెలుగు సాహిత్యానికి బ్రౌన్ సేవలు చిరస్మరణీయం



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్రౌన్ జయంతి కార్యక్రమం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో సర్ చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ జయంతి సంస్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. బ్రౌన్ చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించారు. అనంతరం తెలుగుశాఖ అధ్యక్షుడు మట్టా సంపత్ కుమార్‌రెడ్డి సీపీ బ్రౌన్ సేవలను విద్యార్థులకు వివరించారు. పుట్టుకతో ఆంగ్లేయుడైనా తెలుగు భాష పట్ల మమకారం పెంచుకొని తన జీవితం మొత్తాన్ని తెలుగు భాషాసాహిత్యాల కోసం ధారపోసిన ఆంగ్లేయ కంపెనీ ప్రభుత్వఉద్యోగి చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ అని కొనియాడారు. ఆయన వృద్ధాప్యంలో లండన్‌కు వెళ్లినా తెలుగు సాహిత్య సేవ, పరిశ్రమ మరువలేదని వేమన పద్యాలను ఆంగ్లంలోకి అనువదించి తెలుగు సాహిత్యాన్ని మొట్టమొదటిసారి ప్రపంచానికి అందించిన ఘనత బ్రౌనుదేనని సంపత్ కుమార్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా తెలుగు విభాగాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీత అభినందించారు. జయంతి కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యాపకులు పిట్ల దాసు, నారోజు వెంకటరమణ, నరేష్, శైలజ, సాయిసురేష్, రమణ తదితరులు డిగ్రీ, ఎంఏ. తెలుగు విద్యార్థులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి క్రీడల్లో దుబ్బాక విద్యార్థుల ప్రతిభ



కప్‌తో గురుకుల ప్రిన్సిపాల్ సుజాత, విద్యార్థులు

దుబ్బాక, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం దేవంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా విద్యాలయంలో మూడు రోజుల పాటు జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో దుబ్బాక సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు ప్రిన్సిపాల్ ఆకుల సుజాత తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె పాఠశాలలో మాట్లాడుతూ అండర్- 14 విభాగంలో ఎన్. స్టీఫెన్ డిస్కస్ త్రోలో 400 మీటర్ల విభాగంలో ప్రథమ స్థానం, 600 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, ఎల్. ఋషి 600 మీటర్ల విభాగంలో ప్రథమ స్థానం, ఎన్. స్టీఫెన్ లాంగ్ జంప్‌లో మూడవ స్థానం, చెస్ బి. భాను ప్రసాద్ ప్రథమ స్థానం, క్యారంలో శ్రీకర్, సాయితేజ ద్వితీయ స్థానం సాధించి, వ్యక్తిగత అథ్లెటిక్స్ విభాగంలో చాంపియన్ షిప్ సాధించారన్నారు. జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, పీఈటీ మహేష్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల అధ్యాపకులు ప్రకాశ్, నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లతో భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి

కొండపాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తును ఉజ్వలంగా ఉండే విధంగా తయారు కావాలని ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ స్టూడెంట్ కౌన్సెలర్ అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం డ్రగ్స్ రహిత తెలంగాణలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చేతిలో భవిత ఉందని, మనం లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఉన్నతంగా ఎదిగే విధంగా తయారు కావాలని సూచించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి, వాటికీ సంబంచిన సమాచారం ఉంటే పోలీస్ వారికి తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిప్రసాద్ నాయుడు, లెక్చరర్స్ శ్రీనివాస్, శశిధర్ రెడ్డి, రాములు, వెంకన్న, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలపై వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

గజ్వేల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముస్లింలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని గజ్వేల్ బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకుడు ఖాజా విరాహత్‌అలీ, యువజన విభాగం నాయకులు జుబేర్ పాషా, పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా మాట్లాడుతూ.. కాంగ్రెస్ లేనిదే ముస్లింలు లేరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కేవలం జూబ్లీహిల్స్ ఎన్నిక కోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవిని ఇచ్చారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మాగంటి సునిత గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సమావేశంలో నాయకులు సయ్యద్ యూసుఫ్, ఇక్బాల్, పర్వేజ్, ఉమర్, గులాం ఆమేర్, రియాజ్, అహ్మద్, వాజిద్, జమీల్, అల్తాఫ్, బాబా, షేర్‌అలీ, పాషా, నవాజ్, జహంగీర్, అక్రమ్ తదితరులు ఉన్నారు.



మల్లికార్జునస్వామి సన్నిధిలోమెదక్ అడిషనల్ ఎస్పీ మహేందర్

మల్లన్నను దర్శించుకున్న మెదక్ అడిషనల్ ఎస్పీ

కొమురవెల్లి,నవంబర్10(ఆంధ్రజ్యోతి):ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని సోమవారం మెదక్ అడిషనల్ ఎస్పీ మహేందర్ దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాన్ని అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. వెంట ఎస్ఐ రాజుగౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠశాలలో స్టేజీ ఏర్పాటుకు వితరణ



దాత భాస్కర్ రెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం ఖమ్మంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం గ్రామానికి చెందిన మంద భాస్కర్ రెడ్డి స్టేజీ నిర్మాణానికి సహకారం అందించారు. విద్యార్థుల సౌకర్యార్థం పలు కార్యక్రమాల నిర్వహణకు స్టేజీ అవసరం ఉందని ఉపాధ్యాయులు, గ్రామస్థులు భాస్కర్ రెడ్డికి తెలపడంతో సుమారు రూ. 50 వేల వ్యయంతో స్టేజిని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డిని సోమవారం ఉపాధ్యాయ బృందం సత్కరించారు.

ప్రారంభమైన కొండపోచమ్మ వార్షికోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో కొండపోచమ్మ

జగదేవ్‌పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీగుల్‌నర్సాపూర్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండపోచమ్మ అమ్మవారి 24వ వార్షిక వేడుకలను ఆలయ నిర్వాహకులు ఘనంగా ప్రారంభించారు. ఏటా ఈ ఉత్సవాలను కార్తీక మాసంలో నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సోమవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆలయ చైర్‌పర్సన్ అనుగీత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం గణపతిపూజ, పుణ్యాహవాచనం, అఖండదీప స్థాపన, ఋత్విగ్వరణము, అగ్నిప్రతిష్ఠాపన, మూలమంత్ర హవనము, అభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక సోమవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రవికుమార్, గ్రామ మాజీ సర్పంచ్ రజిత రమేశ్, ఆలయ సిబ్బంది ఉన్నారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ చైర్ పర్సన్, భక్తులు

కన్నీరు మిగిల్చి..!

(5వ పేజీ తరువాయి)

గొడవలు పెరిగి బలవన్మరణాలు సంభవిస్తున్నాయి. అనారోగ్య సమస్యలు, ప్రేమ వ్యవహారాలు, అపరిమిత కోరికలు మద్యానికి బానిసలవడం వం టివి కూడా ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి.

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు!

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు. బతికి సాధించాలి. చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్యలు చేసుకుని నిండు జీవితాన్ని పాడుచేసుకోవద్దు. జీవితం ఎంతో విలువైనది. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తాయి. జీవితం విలువను తల్లిదండ్రులు, గురువులు చిన్నతనం నుంచే నేర్పిస్తే, ఒత్తిడిని జయించి విజయాన్ని సాధించే అవకాశాలు ఉంటాయి. కాబట్టి ఎవరూ కూడా తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దు.

- డాక్టర్ కుమారస్వామి, గజ్వేల్

డ్రంకెన్ డ్రైవ్‌లో 28 మంది పట్టివేత

● రూ. 2,54,000 జరిమానా ● ముగ్గురికి జైలు

సిద్దిపేట క్రైం/గజ్వేల్/దుబ్బాక, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 28 మందిని సోమవారం ఆయా కోర్టుల్లో ప్రవేశపెట్టగా న్యాయాధికారులు మొత్తం రూ. 2,54,500 జరిమానా విధించారు. నిందితుల్లో ముగ్గురికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించారు. సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పోలీసులు నిర్వహించిన వాహనతనిఖీల్లో 15 మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి. తరణి ఎదుట హాజరుపరచగా, విచారణ అనంతరం రూ.1,51,500 జరిమానా విధించారు. గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళి తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 12 మందిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరుపరచగా మొత్తం రూ. 93వేల జరిమానా విధించారు. నిందితుల్లో ఒకరికి 4రోజులు, ఇద్దరికి 3 రోజుల చొప్పున జైలుశిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. అదేవిధంగా దుబ్బాక సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పట్టణంలో ఈ నెల 7న ఎస్ఐ కీర్తిరాజు ఆధ్వర్యంలో వాహనతనిఖీలు చేపట్టగా ఓ వ్యక్తి మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డాడు. నిందితుడిని దుబ్బాక ప్రథమశ్రేణి న్యాయాధికారి జితేందర్ ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం రూ. 10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

నిప్పంటించుకుని మహిళ ఆత్మహత్యాయత్నం

రాయపోల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సయ్యద్‌నగర్ గ్రామంలో ఓ మహిళ నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. సయ్యద్‌నగర్‌కు చెందిన షాజాన్ బీ(26) సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని తీవ్రంగా గాయపడింది. శరీరంలో సగానికి పైగా కాలినట్లు సమాచారం. వెంటనే స్థానిక 108 అంబులెన్స్‌కు సమాచారమివ్వడంతో అంబులెన్స్ సిబ్బంది దేవేందర్, నరసింహులు షాజాన్‌బీని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

వ్యక్తిపై దాడికి పాల్పడిన నిందితుడి అరెస్ట్

సిద్దిపేట క్రైం నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): వడ్డెర కులస్థుడిపై దాడికి పాల్పడిన వ్యక్తిని టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌చార్జి సీఐ వాసుదేవ రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 5న సాయంత్రం మందపల్లి శివారులో డీ ఎక్స్‌ఎన్ కంపెనీ సమీపంలో కట్ చేసిన బండరాళ్లను మెట్పల్లి గ్రామానికి చెందిన కుంచెం రవి తరలిస్తుండగా మందపల్లి గ్రామానికి చెందిన గాంధీ రెడ్డి అడ్డుకున్నాడు. ట్రాక్టర్‌ను ఆపి ఇష్టం వచ్చినట్లు దూషిస్తూ, కులం పేరుతో తిట్టి, చేతులతో కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఆసిఫ్ కేసు నమోదు చేశారు. సోమవారం గుండ్లపల్లి టోల్ ప్లాజా వద్ద గాంధీరెడ్డిని అదుపులోకి తీసుకొని స్టేషన్ కు తరలించి అరెస్ట్ చేసి జ్యూడిషల్ రిమాండ్‌కు తరలించారు.

విజేతలకు నగదు పురస్కారం అందజేత



విజేత జట్టుకు నగదు ట్రోఫీని అందజేస్తున్న కృష్ణయాదవ్ తదితరులు

మర్కుక్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులు కూడా ఐపీఎల్ దాకా వెళ్లాలని దామరకుంట ఎంపీటీసీ, మర్కుక్ మండల మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజబోయిన కృష్ణయాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దామరకుంట గ్రామ యువకులు నిర్వహించిన దామరకుంట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాయత్రి బాలనర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ పత్తి అంజనేయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ తదితరులు

రాయపోల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయపోల్, కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం మండల స్పెషల్ ఆఫీసర్ బాబూనాయక్, ఎంపీడీవో జెంలానాయక్, వ్యవసాయ అధికారి ఆర్. నరేష్ పర్యటించి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు వరి ధాన్యాన్ని తేమ శాతం అనుకూలంగా వచ్చే వరకు బాగా ఆరబెట్టాలని, ధాన్యాన్ని శుభ్రంగా ఉంచాలని సూచించారు. నిర్ధేశిత తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంట వేయాలని కొనుగోలు కేంద్రాల్లోని ఇన్‌చార్జిలను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈవో రాములు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో గజ్జల కనకరాజు

దౌల్తాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతీ పాఠశాల సమగ్ర సమాచారాన్ని తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని మండల విద్యాధికారి గజ్జల కనకరాజు అన్నారు. సోమవారం జడ్పీ బాలుర పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తరగతి గదుల్లో సెల్ ఫోన్లను ఉపయోగించవద్దన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు, విద్యార్థులు తప్పకుండా ఒక గుర్తింపు హాజరు అప్డేట్ ఉండాలని సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఉండాలని ఆన్‌లైన్‌లో హాజరు నమోదు తప్పకుండా పొందుపరచాలని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు అఫ్జల్, పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, మండల కేంద్రం సిబ్బంది పెంటయ్య, శేఖర్, మల్లేశం, చంద్రమౌళి, కుమార్, నగేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య తెలిపారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ప్రతీ మహిళ తన హక్కులను తెలుసుకోవడం, చట్టాన్ని అర్థం చేసుకోవడం, అవసరమైనప్పుడు న్యాయ సహాయం పొందడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.